# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 11 | ఎడిటర్: మేనం శ్యామ్ | గురువారం 30-07-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

ఓ సిరా చుక్కలాగే సగటు మనిషి
పసిపాపగా తెల్లని కాగితం లాంటి
ఈ లోకంలో ప్రయాణాన్ని మొదలుపెడతాడు.
అమ్మ ఒడిలో చిలిపి నవ్వులు చిందిస్తూ
తొలి అడుగుల ముద్రలతో
తన రంగులను అద్దుకోవడం ప్రారంభిస్తాడు.
బడికెళ్లి చదువుల జల్లుల్లో తడుస్తూ
భావి జీవితానికి కావలసిన జ్ఞానాన్ని,
ఆశలను మనసులో నింపుకుంటాడు.
యవ్వనంలోకి వస్తూనే
కలల అలలపై తేలుతూ
గమ్యాన్ని చేరుకోవడానికి
రాత్రింబవళ్ళు కష్టపడతాడు.
సంసార బంధాల్లో అడుగుపెట్టి
బాధ్యతల బరువును మోస్తూ
తన కష్టాన్నంతా కుటుంబం కోసం
ధారపోస్తాడు.
జీవితపు ఎండకన్నెర్రతనంలో
స్వేద చుక్కగా మారి కంటిపాపల వెలుగుల
కోసం నిరంతరం తపిస్తుంటాడు.
కష్టసుఖాల కలబోతగా సాగే ప్రయాణంలో
గెలుపోటముల అనుభవాలను తలచుకుంటూ
సాగిపోతాడు.
కాలం వేగంగా కరిగిపోతుంటే
వృద్ధాప్యపు అంచులకు చేరుకుని
గడిచిన రోజులను జ్ఞాపకాలుగా పేర్చుకుంటాడు.
ఆరోగ్యం క్షీణించి, శక్తులన్నీ ఉడిగిపోయాక
తను వదిలిన గురుతులను చూసుకుంటూ
విశ్రాంతి వైపు వెళ్తాడు.
చివరకు కాగితంపై రాలి ఆరిపోయిన
సిరా చుక్కలాగే మనిషి కూడా
తన సంతకాన్ని ముగించి
అనంత వాయువుల్లో కలిసిపోతాడు.

– కొయ్యడ అనిల్ కుమార్ హుస్నాబాద్ ..
సిద్దిపేట జిల్లా బ్యూరో చీఫ్...

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు

- సీపీ సజ్జనార్ కీలక వివరాలు వెల్లడి
- ఇన్‌స్టాగ్రామ్ పరిచయం ప్రేమగా మారి.. విభేదాలతో వేధింపుల కేసు
- స్టాకింగ్, ఫేక్ అకౌంట్లు, బెదిరింపులకు పాల్పడ్డాడని పోలీసుల వెల్లడి..
- కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు రిమాండ్..
- ప్రత్యేక బృందంతో దర్యాప్తు కొనసాగింపు..




2 లో



## తెలంగాణ కాంగ్రెస్‌కు హైకమాండ్ కీలక ఆదేశాలు

- సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అదే ప్రధాన ప్రాధాన్యమని స్పష్టీకరణ
- ఓటర్ల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యామ్నాయం తప్పదని హెచ్చరిక
- నామినేటెడ్ పదవుల భర్తీపై సర్ పూర్తయ్యాకే నిర్ణయమని కేసీ వేణుగోపాల్..



## 'ప్రజా వాయిస్' కథనానికి భారీ ఎఫెక్ట్..!

- కదిలిన జిల్లా విద్యాశాఖ యంత్రాంగం
- సన్ రైజ్ స్కూల్ గోడపై ఎంఈఓ హెచ్చరిక నోటీస్
- 7వ తరగతి వరకే అనుమతి
- 8, 9, 10 తరగతుల్లో ప్రవేశాలు వద్దంటూ స్పష్టమైన ప్రకటన
- ప్రజావాయిస్ కథనానికి హర్షం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు, తల్లితండ్రులు

2 లో



## 10 నెలలుగా పెండింగ్‌లో సర్వే.. ప్రజా వాయిస్ కథనంతో గంటల్లో పూర్తి!

- ప్రజా వాయిస్ స్టింగ్ ఆపరేషన్‌తో కదిలిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు..
- కథనం ప్రచురితమైన గంటల్లోనే క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి..
- సర్వేయర్ల కొరతతో ప్రజలకు ఇబ్బందులు..
- ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజా వాయిస్ డిమాండ్..

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ప్రజా సమస్యలపై ప్రజా వాయిస్ పోరాటం మరోసారి ఫలించింది. దాదాపు 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న భూ సర్వే వ్యవహారంపై ప్రజా వాయిస్ ప్రచురించిన ప్రత్యేక కథనం, స్టింగ్ ఆపరేషన్‌కు అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. కథనం వెలువడిన గంటల వ్యవధిలోనే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయికి చేరుకుని సర్వే ప్రక్రియను పూర్తి చేశారు.

**ప్రజా వాయిస్ కథనంతో కదిలిన యంత్రాంగం**

PRAJA VOICE EFFECT

బాధితురాలు పలుమార్లు అధికారులను వేడుకున్నా స్పందన లేకపోయింది. కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదు. అయితే ప్రజా వాయిస్ స్టింగ్ ఆపరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సర్వే

మిగతా 2లో


స్పందించండి మేడ్చల్ జిల్లా కలెక్టర్ వెంటనే ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళకు తక్షణమే న్యాయం చేయాలని ప్రజా వాయిస్ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాల్సిన అధికారులు ప్రజలను ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పంపించడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ సార్.. మీరే మాకు దిక్కు!**

- ప్రజా వాయిస్ స్టింగ్ ఆపరేషన్‌లో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- ప్రైవేట్ సర్వేయర్ల దందా బట్టబయలు
- ఎంఆర్వో, ఆర్డీవో చెప్పినా సిబంది లో చలనం లేదు



## పార్లమెంట్‌లో రాహుల్ ఆరోపణలు

- అమిత్ షా రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్
- విద్యార్థులపై పోలీసు బలప్రయోగానికి అమిత్ షాయే ఆదేశాలిచ్చారని ఆరోపణ
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని రాహుల్ స్పష్టం
- పెల్లెట్ గన్స్, షాక్ బ్యాటన్లు, మేకుల లాఠీలతో విద్యార్థులపై దాడి చేశారని విమర్శ



## భారీ వర్షాలపై జలమండలి అలర్ట్..

- అధికారులతో ఎండీ అశోక్ రెడ్డి అత్యవసర సమావేశం
- హాట్‌స్పాట్లపై ప్రత్యేక దృష్టి.. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు.
- మ్యాన్‌హోల్ మూతలు తెరవొద్దని ప్రజలకు జలమండలి విజ్ఞప్తి..
- వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రల పంపిణీ..
- భద్రతా చర్యలు కట్టుదిట్టం..

2 లో









## కాంగ్రెస్‌లో ఫిరాయింపు ఎమ్మెల్యేల అసంతృప్తి?

- ఉమ్మడి రంగారెడ్డిలో రాజకీయ చర్చ
- హామీలు అమలు కాలేదంటూ అసంతృప్తిలో ఫిరాయింపు ఎమ్మెల్యేలన్న ప్రచారం
- పార్టీలో తగిన గౌరవం, ప్రాధాన్యం దక్కడం లేదని అంతర్గత చర్చ.
- కార్పొరేషన్ ఎన్నికల వేళ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలపై ఊహాగానాలు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నెలకొన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారిన అనంతరం ఇప్పుడు ఆశించిన స్థాయిలో గౌరవం, ప్రాధాన్యం దక్కడం లేదనే భావన వారిలో వ్యక్తమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

**ప్రకాష్ గౌడ్ అసంతృప్తి?..**

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన సన్నిహితుల వద్ద నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన ఓ కీలక నేత పెత్తనం చెలాయిస్తున్నారని, భూ వ్యవహారాల్లో జోక్యం పెరిగిందని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో స్థానిక రాజకీయాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

**కాలె యాదయ్య ఆవేదన?..**

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు లభించిన గౌరవం ఇప్పుడు కాంగ్రెస్‌లో దక్కడం లేదని తన అనుచరుల వద్ద వాపోయినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ మారినా తగిన గుర్తింపు లేకపోవడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నారని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

**అరికెపూడి గాంధీకి పదవి ఆశ?..**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పార్టీ మారే సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని, రానున్న కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో తనకు కీలక పదవి ఇవ్వాలని ఆయన అనుచరుల ద్వారా పార్టీ అధిష్ఠానానికి సంకేతాలు పంపుతున్నట్లు సమాచారం.

**రాజకీయ వర్గాల్లో చర్చ**

మొత్తంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు పార్టీలో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఈ అంశాలపై సంబంధిత ఎమ్మెల్యేల నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యంకి కారణం కాంగ్రెస్ వేధింపులే

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వ ఒత్తిడితోనే గుండెపోటు వచ్చిందని ఆరోపణ
- భూ వ్యవహారాలు, ఈడీబ్ల్యూ కేసులతో టార్గెట్ చేశారన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- యశోద ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స.. ఆరోగ్య పరిస్థితి విషమం

2 లో



# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:** ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, స్టాకింగ్, బెదిరింపుల కేసులో అరెస్టైన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంపై హైదరాబాద్ సీపీ సీవీ సజ్జనార్ కీలక వివరాలు వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిన తర్వాత విభేదాలు తలెత్తడంతో ఉదయ్ కృష్ణారెడ్డి బాధిత అధికారిణిని వివిధ రూపాల్లో వేధించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు.

**ఇన్‌స్టాగ్రామ్ పరిచయంతో ప్రారంభమైన సంబంధం**

సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసి, అనంతరం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. 2025లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధిత మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణితో పరిచయం ఏర్పడి, అది క్రమంగా ప్రేమగా మారినట్లు తెలిపారు.

**విభేదాల తర్వాత వేధింపులు**

ఐపీఎస్ శిక్షణ సమయంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయని, అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించడం, బాధితురాలి ల్యాప్‌టాప్‌ను ధ్వంసం చేయడం, ఆమె బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత చాట్‌లను బయటపెడతానంటూ బెదిరించడం వంటి చర్యలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని సీపీ సజ్జనార్ తెలిపారు.

**కుటుంబ సభ్యులకూ ఇబ్బందులు..**

బాధితురాలి కుటుంబ సభ్యులు, సహచరులను అనుమతి లేకుండా సంప్రదించడం, నిరంతరం స్టాకింగ్ చేయడం వంటి చర్యలు కూడా ఉదయ్ కృష్ణారెడ్డి చేసినట్లు వెల్లడించారు. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు సంబంధాన్ని ముగించి, అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకున్నప్పటికీ వేధింపులు కొనసాగినట్లు పేర్కొన్నారు.

**అరెస్ట్.. రిమాండ్.. దర్యాప్తు కొనసాగింపు**

ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లభించడంతో ఈ నెల 28వ తేదీ రాత్రి హైదరాబాద్‌లోని ఆరాంఘర్ ఎక్స్ రోడ్ సమీపంలో ఉదయ్ కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. అనంతరం రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆయనను చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు పంపింది. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు సీపీ సీవీ సజ్జనార్ వెల్లడించారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్

- ఉప్పర్‌పల్లి కోర్టు ఆగస్టు 11 వరకు జ్యుడీషియల్ రిమాండ్
- భారీ భద్రత మధ్య చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్, ప్రజా వాయిస్:**తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డికి ఉప్పర్‌పల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బుధవారం ఆయనను కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**చంచల్‌గూడ జైలుకు తరలింపు**

కోర్టు ఆదేశాల మేరకు ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు భారీ భద్రత నడుమ చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. అంతకుముందు మంగళవారం మిర్యాలగూడలో ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు, అనంతరం ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులకు అప్పగించారు.

**వైద్య పరీక్షల్లో కీలక అంశాలు**

ఈ కేసులో బాధిత మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణికి జూలై 18న నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆమెపై భౌతిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయినట్లు సమాచారం. బాధితురాలి గొంతు నులిమిన ఆనవాళ్లు, చెంపపై గాయాలు, ఎడమ కాలిపై గాయాలు ఉన్నట్లు వైద్య నివేదికలో నమోదైనట్లు తెలుస్తోంది.

**దర్యాప్తు కొనసాగుతోంది**

ఉదయ్‌కృష్ణారెడ్డిపై నమోదైన లైంగిక వేధింపులు, స్టాకింగ్, దాడి, బెదిరింపుల కేసులపై మహిళా భద్రతా విభాగం అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 10 నెలలుగా పెండింగ్‌లో సర్వే.. ప్రజా వాయిస్ కథనంతో గంటల్లో పూర్తి!

మొదటి పేజీ తరువాయి

నిర్వహించారు.

**సర్వేయర్లపై తీవ్ర పని భారం**

ఈ ఘటన ఒక్కటే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉందనే వాస్తవాన్ని ఈ సంఘటన మరోసారి బయటపెట్టింది. రెండు నుంచి మూడు మండలాలకు ఒక్క సర్వేయర్ మాత్రమే ఉండటంతో పని భారం విపరీతంగా పెరిగి, సర్వేలు నెలల తరబడి పెండింగ్‌లో పడుతున్నాయి. సరైన పరికరాలు, తగిన సిబ్బంది లేక సర్వేయర్లు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రజలు నెలల తరబడి నిరీక్షణ**

భూ సర్వే కోసం ప్రజలు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకవైపు అధికారుల నిర్లక్ష్యం, మరోవైపు సిబ్బంది కొరత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించి సర్వేయర్ల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు అవసరమైన సాంకేతిక పరికరాలు అందించాలని ప్రజా వాయిస్ డిమాండ్ చేస్తోంది.

**ప్రజల గొంతుకగా ప్రజా వాయిస్**

ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, అధికార యంత్రాంగాన్ని కదిలించడం ప్రజా వాయిస్ బాధ్యతగా కొనసాగుతుందని, ప్రజా ప్రయోజనాల కోసం ఇలాంటి కథనాలను నిరంతరం కొనసాగిస్తామని ప్రజా వాయిస్ స్పష్టం చేస్తోంది.

# భారీ వర్షాలపై జలమండలి అలర్ట్..



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉన్నతస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ అప్రమత్తంగా ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**హాట్‌స్పాట్లపై ప్రత్యేక నిఘా**

ముంపు ప్రాంతాల్లో వరద నీటి తొలగింపు, సీవర్ జెట్టింగ్ యంత్రాల పనితీరును డీజీఎంలు స్వయంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. రహదారులపై మ్యాన్‌హోళ్ల వద్ద సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ఇళ్ల వద్ద నిల్వ ఉండే మురుగు నీటి సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. లోతైన మ్యాన్‌హోళ్లు, మురుగు ఉప్పొంగే హాట్‌స్పాట్లను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

**తాగునీటి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ**

తాగునీటి సరఫరా సమయంలో నీటి నాణ్యతను తప్పనిసరిగా పరీక్షించాలని, బస్తీలు, లోతట్టు ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పనులు జరిగే ప్రతి ప్రాంతంలో తప్పనిసరిగా బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ప్రజలకు కీలక సూచనలు**

క్షేత్రస్థాయి సిబ్బంది హెల్మెట్లు, గ్లౌజులు, గమ్‌బూట్లు ధరించి భద్రతా ప్రమాణాలు పాటించాలని, వరద ప్రభావిత ప్రాంతాల్లో క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖలతో సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. నగర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను స్వయంగా తెరవవద్దని జలమండలి విజ్ఞప్తి చేసింది. తాగునీటి సరఫరా లేదా సీవరేజీ సమస్యలు ఎదురైతే జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ కాంగ్రెస్‌కు హైకమాండ్ కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. దక్షిణాదిలో పార్టీ పట్టు మరింత బలపడేలా ముందస్తు వ్యూహాలు అమలు చేస్తూ, తెలంగాణలో ప్రభుత్వ–పార్టీ సమన్వయంతో పాటు సంస్థాగత బలోపేతంపై కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సహా పలువురు నేతలతో కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జ్ కేసీ వేణుగోపాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

**సర్ ప్రక్రియపైనే పూర్తి దృష్టి**

సమావేశంలో రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ (SIR) ఓటర్ల ప్రక్రియ ప్రధానంగా చర్చకు వచ్చింది. ఈ ప్రక్రియను కొందరు నేతలు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయని కేసీ వేణుగోపాల్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి నాయకుడు అదే పనిపై పూర్తి దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది.

**నిర్లక్ష్యం చేస్తే చర్యలు**

సర్ ప్రక్రియ పర్యవేక్షణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారికి ప్రత్యామ్నాయం చూడాలని పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో ఒక్క ఓటు కూడా కోల్పోకుండా ప్రతి బూత్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని సూచించినట్లు తెలుస్తోంది.

**సంస్థాగత బలోపేతంపై సమీక్ష**

బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, సంఘటన్ సృజన్ అభియాన్ (ఎస్ఎస్ఏ) పురోగతిని సమావేశంలో సమీక్షించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలు, మండల కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల పనితీరు, పార్టీ విస్తరణ కార్యక్రమాలు, ప్రభుత్వ–పార్టీ సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం.

**పదవుల భర్తీకి ఇంకా వేచి చూడాలి**

పార్టీలో పెండింగ్‌లో ఉన్న పీసీసీతో పాటు ఇతర నామినేటెడ్ పదవుల భర్తీ అంశం కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే రాష్ట్రంలో సర్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఆ నియామకాలపై నిర్ణయం తీసుకుంటామని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి

# పార్లమెంట్‌లో రాహుల్ ఆరోపణలు



**న్యూఢిల్లీ, ప్రజా వాయిస్:** ఈ నెల 20న ఢిల్లీలో విద్యార్థులు నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన పోలీసు బలప్రయోగానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షాయే ఆదేశాలు ఇచ్చారని లోక్‌సభలో ఆరోపించిన విపక్ష నేత రాహుల్ గాంధీ.. తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్లు మరోసారి స్పష్టం చేశారు. లోక్‌సభలో తన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభ వాయిదా పడగా, అనంతరం పేపర్ లీక్‌ల నిరోధక బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**క్షమాపణ చెప్పబోను..**

లోక్‌సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపిస్తూ నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీని మరోసారి కోరారు. తాను క్షమాపణ చెబితే ప్రసంగాన్ని కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని చెప్పారని, అయితే బీజేపీకి గానీ, ఆర్ఎస్ఎస్‌కు గానీ ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజులకు పలుమార్లు మాట్లాడే అవకాశం ఇచ్చారని కూడా గుర్తు చేశారు.

**విద్యార్థులపై దాడుల ఆరోపణలు**

ప్రశ్నలు అడిగే విద్యార్థులపై ప్రభుత్వం అత్యంత క్రూరంగా వ్యవహరించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనకారులపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారని, ఒక విద్యార్థి కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఎయిమ్స్ వైద్య ధ్రువీకరణ పత్రాన్ని తాను పరిశీలించినట్లు తెలిపారు.

**షాక్ బ్యాటన్లు, మేకుల లాఠీలు వాడారన్న ఆరోపణ**

నిరసనలో పాల్గొన్న మహిళలు, మైనర్లపై కూడా పోలీసులు షాక్ బ్యాటన్లు, మేకులు ఉన్న లాఠీలతో దాడి చేశారని రాహుల్ ఆరోపించారు. నిరసన సందర్భంగా పోలీసు అధికారులకు అమిత్ షా స్వయంగా ఆదేశాలు ఇస్తున్నట్లు తాను చూశానని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా హోంమంత్రి అమిత్ షా నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యంకి కారణం కాంగ్రెస్ వేధింపులే



**హైదరాబాద్, ప్రజా వాయిస్:** బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం విషమంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన అనారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వ వేధింపులే కారణమని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడి ప్రమేయంతో భూ వ్యవహారాలు, ఈఓడబ్ల్యూ కేసుల ద్వారా పెద్ది సుదర్శన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు.

**భూ వ్యవహారాలు, కేసులతో ఒత్తిడి..**


నర్సంపేటలో భూ లావాదేవీల వ్యవహారంలో సీఎం సన్నిహితుడు ఆసక్తి చూపారని, అనంతరం ఈఓడబ్ల్యూలో కేసులు నమోదు చేసి పెద్ది సుదర్శన్ రెడ్డికి సన్నిహితులైన వ్యాపారులను విచారణ పేరుతో వేధించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఈ కేసులో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరును చేర్చాలని కూడా ఒత్తిడి తీసుకొచ్చారని, పలువురు అధికారులను సంప్రదించినా ఉపశమనం లభించలేదని పేర్కొన్నారు.

**అవినీతి అంశాలను బయటపెట్టినందుకే టార్గెట్ చేశారని ఆరోపణ**

గురుకుల బంకర్ బెడ్ల కొనుగోలు, సివిల్ సప్లైస్‌లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించారని, రూ.1,100 కోట్ల సివిల్ సప్లైస్ స్కాం, బంకర్ బెడ్ల కొనుగోలు వ్యవహారాలపై ఈడీ, హైకోర్టు, సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని తెలిపారు. ఈ అంశాలే ఆయనను టార్గెట్ చేయడానికి కారణమయ్యాయని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.

**వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగింపు**

మరోవైపు గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి విడుదల చేసిన హెల్త్ బులెటిన్ ప్రకారం తీవ్ర పల్మనరీ ఎంబోలిజం కారణంగా ఆయనకు కార్డియాక్ అరెస్ట్ సంభవించింది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతుండగా, బీపీతో పాటు ఇతర కీలక అవయవాల పనితీరు నిలకడగా ఉన్నప్పటికీ మెదడుకు తగినంత ఆక్సిజన్ అందక పోవడంతో న్యూరాలజికల్ స్పందన కనిపించడం లేదని వైద్యులు తెలిపారు. మరో 72 గంటల తర్వాత నిర్వహించే న్యూరాలజికల్ రీ–అసెస్‌మెంట్ అనంతరం ఆరోగ్య పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.


ప్రజా వాయిస్
ఇది ప్రజల గొంతుక
29 Jul 2026 - Page 1

పర్మిషన్ పరిమితం... బోధన అపరిమితం

- అనుమతులు ఏడో తరగతి వరకే
- పదో తరగతి వరకు బోధన ఎలా
- అనుముల మండలంలో సన్ రైస్ రెసిడెన్షియల్ స్కూల్ పై ఆరోపణల దుమారం
- అనుమతి లేని తరగతుల్లో బోధన సాగుతోందని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ఆరోపణలు
- ప్రజా వాణిలో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు
- హాస్టల్‌లో కనీస వసతులు కరువు
- విద్యార్థుల భద్రతపై ఆందోళన
- ఎంఈఓ నోటీసు జారీ.. డీఈఓ స్పందన కోసం చేసిన ప్రయత్నం ఫలించలేదు



# 'ప్రజా వాయిస్' కథనానికి భారీ ఎఫెక్ట్..!

**ప్రజా వాయిస్, నల్గొండ.**నల్గొండ జిల్లా అనుముల మండలంలోని అల్వాల ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న సన్ రైస్ రెసిడెన్షియల్/ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రభుత్వ అనుమతులకు మించి 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్న వ్యవహారాన్ని ప్రజా వాయిస్ దినపత్రిక "పర్మిషన్ పరిమితం... బోధన అపరిమితం" శీర్షికతో వెలుగులోకి తీసుకురావడంతో విద్యాశాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. కథనం ప్రచురితమైన కొద్ది గంటల్లోనే మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) స్పందించి పాఠశాల యాజమాన్యానికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ కీలక ప్రకటన విడుదల చేశారు.

**స్కూల్ గోడపైనే అధికారిక నోటీస్**

విద్యాశాఖ విడుదల చేసిన అధికారిక ప్రెస్ నోట్‌తో పాటు ★'ప్రజా వాయిస్'★లో ప్రచురితమైన కథన క్లిప్పింగ్‌ను పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద గోడపై అధికారులు బహిరంగంగా అంటించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాఠశాలకు 7వ తరగతి వరకే ప్రభుత్వ అనుమతి ఉందని, 8, 9, 10 తరగతులకు ఎలాంటి గుర్తింపు లేదని నోటీస్‌లో స్పష్టం చేశారు.

**అనుమతి లేని తరగతుల్లో చేరవద్దు**

సన్ రైస్ పాఠశాలలో 8, 9, 10 తరగతుల్లో విద్యార్థులను చేర్పించవద్దని తల్లిదండ్రులకు ఎంఈఓ స్పష్టంగా సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు ముందు సంబంధిత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు, అనుమతులు ఉన్నాయా లేదా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజా వాయిస్ కథనానికి ఫలితం**

అనుమతులు లేకుండానే ఉన్నత తరగతులు నిర్వహించడం, హాస్టల్ నిర్వహణలో నిబంధనలను ఉల్లంఘించడం, విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం వంటి అంశాలను 'ప్రజా వాయిస్' సమగ్ర ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడంతో విద్యాశాఖ వెంటనే చర్యలకు దిగింది. పాఠశాల గోడపైనే హెచ్చరిక నోటీస్ అంటించడం ద్వారా తల్లిదండ్రులను అప్రమత్తం చేయడం ఈ వ్యవహారంలో కీలక పరిణామంగా మారింది.

**ఇతర పాఠశాలలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఈ ఘటనతో తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజలు స్పందిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఇతర ప్రైవేటు విద్యాసంస్థలపై కూడా ఇదే తరహాలో తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను కోరుతున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో 'ప్రజా వాయిస్' కథనం కీలక పాత్ర పోషించిందని వారు అభిప్రాయపడుతున్నారు.

# జీతం కోసం కాదు.. జీవితం కోసం

- వానలోనూ విధి నిర్వర్తన
- మంథని మున్సిపల్ కార్మికుల సేవలకు సెల్యూట్
- భారీ వర్షం..ముంపు ముప్పు.. అయినా వెనక్కి తగ్గని పారిశుధ్య సిబ్బంది
- మురుగు కాలువల్లోకి దిగి.. వీధుల్లో నీరు నిలవకుండా నిరంతర శ్రమ
- జీతం కాదు జీవితం.. బరువు కాదు బాధ్యత'కు నిలువెత్తు నిదర్శనం



**ప్రజా వాయిస్,మంథని** ఆకాశం నుంచి కుండపోత.. వీధుల్లోకి వరద నీరు.. ఎక్కడ చూసినా ముంపు భయం. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతారు. కానీ మంథని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మాత్రం వర్షాన్ని లెక్కచేయకుండా విధుల్లోకి దిగారు. ప్రజల ఇబ్బందులను తమ ఇబ్బందులుగా భావిస్తూ.. మురుగు కాలువల్లోకి దిగి నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించారు. వీధుల్లో వర్షపు నీరు నిలవకుండా నిరంతరం శ్రమించారు.

**వర్షంలో తడుస్తూనే.. విధుల్లో నిమగ్నం**

బుధవారం మంథని పురపాలక సంఘం పరిధిలో భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో నీరు నిలిచే పరిస్థితి ఏర్పడింది. ముంపు సమస్య తలెత్తకుండా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్లపైకి వచ్చి పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువలను శుభ్రం చేస్తూ..నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

**ఉద్యోగం కాదు.. సామాజిక బాధ్యత**


తమకు అప్పగించిన పనిని కేవలం నెల జీతం కోసం చేసే ఉద్యోగంగా కాకుండా.. సమాజం పట్ల తమ బాధ్యతగా భావిస్తున్నామని ఈ కార్మికుల సేవలు చాటుతున్నాయి. ప్రజలు ఇళ్లలో సురక్షితంగా ఉండేందుకు.. పరిశుభ్రమైన వాతావరణంలో జీవించేందుకు.. తాము మాత్రం వర్షంలో తడుస్తూ విధులు నిర్వర్తిస్తున్నారు.


**కనిపించేది చెత్త.. కనిపించనిది వారి శ్రమ**

పట్టణం పరిశుభ్రంగా కనిపించినప్పుడు అందరి దృష్టి ఆ అందంపైనే ఉంటుంది. కానీ ఆ పరిశుభ్రత వెనుక ప్రతిరోజూ శ్రమించే పారిశుధ్య కార్మికుల కష్టం మాత్రం చాలాసార్లు కనిపించదు. ఎండైనా..వానైనా.. పండుగైనా..సాధారణ రోజైనా ప్రజల కోసం విధుల్లో ఉండే ఈ కార్మికుల సేవలు నిజంగా అభినందనీయం.జీతం కాదు జీవితం.. బరువు కాదు బాధ్యత అనే మాటకు మంథని మున్సిపల్ కార్మిక సిబ్బంది నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం ప్రతికూల పరిస్థితుల్లోనూ సేవలందిస్తున్న వారికి మంథని ప్రజల తరపున శిరస్సు వంచి అభివాదం.

# పెద్దపల్లి కలెక్టర్ గారు జర చూడండ్రి

- సోలార్ ప్లాంట్ వల్ల రైతు కీ తప్పని 'పంట నష్టం' నిరీక్షణ!
- గతేడాది మంథని ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చినా అందని న్యాయం
- పట్టించుకోని అధికారులు, కన్ను తెరవని సోలార్ యాజమాన్యం
- పదేళ్ల నష్టంపై ఇప్పటికీ స్పందన శూన్యం.. రైతు ఆవేదన!
- ప్రజా వాయిస్ ద్వారా కలెక్టర్ గారికి మా ఆవేదన చేరి న్యాయం చేయాలని కోరుకుంటున్నాం!





**ప్రజా వాయిస్ మంథని** అధికారుల చుట్టూ తిరిగినా, అర్జీలు సమర్పించినా పేద రైతు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం గ్రామానికి చెందిన రైతు బుద్దె రెడ్డి సత్తయ్య గతేడాది మంథని ఆర్డీవోకి స్వయంగా వినతిపత్రం సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఆయనకు ఎలాంటి న్యాయం జరగకపోవడం గమనార్హం.

**అడుగు ముందుకు పడలేదు:**

పోతారం గ్రామంలోని "హైరావచల్ సోలార్ పవర్ ప్లాంట్ 15MW (రెస్కో)" నుండి వచ్చే వర్షపు నీటి వల్ల తన రెండున్నర (2.5) ఎకరాల పంట పొలం పూర్తిగా దెబ్బతింటోందని సత్తయ్య గతేడాది ఆగస్టులో అధికారులకు విన్నవించారు. వర్షపు నీరు పొలంలోకి రాకుండా పైపులు వేయాలని లేదా కట్ట నిర్మించాలని, ఏడేళ్లుగా జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. కానీ ఏడాది గడిచినా అధికారుల నుంచి గానీ, సోలార్ ప్లాంట్ యాజమాన్యం నుంచి గానీ ఎలాంటి సానుకూల స్పందన లేదని బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సమస్య అలాగే.. దౌర్జన్యమూ అలాగే!**

గతంలో నీటి ప్రవాహాన్ని ప్రశ్నించినందుకు సోలార్ ప్లాంట్ సిబ్బంది మరియు సెక్యూరిటీ గార్డులు రైతు కుటుంబంపై బూతులు తిడుతూ బెదిరింపులకు దిగడంపై కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. అయినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ప్లాంట్ యాజమాన్యం తీరు మారలేదని, ప్రతి వర్షకాలంలోనూ తమ పొలం నీట మునుగుతూనే ఉందాని రైతు వాపోతున్నారు.

**ఇప్పటికైనా స్పందించాలి:**

రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా ఈ సమస్యపై దృష్టి సారించాలని రైతు బుద్దె రెడ్డి సత్తయ్య వేడుకుంటున్నారు. జిల్లా రెవెన్యూ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, సోలార్ నీరు పొలంలోకి రాకుండా చర్యలు చేపట్టాలని, నష్టపోయిన పంటకు తగిన పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు, రైతు సంఘాలు కోరుతున్నాయి.



## ఎంపీడీవో కార్యాలయం ముందు రోడ్డు దుస్థితి

- వివిధ సమస్యల నిమిత్తం నిత్యం పదుల సంఖ్యలో ప్రజల రాకపోకలు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న మండల అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు దుస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న స్థానికులు
- రోడ్డు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికుల డిమాండ్.

**ప్రజా వాయిస్/తాండూర్:** గత వారం రోజుల నుంచి అడపదడపా కురుస్తున్న వర్షాలకు, పెద్దేముల్ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా తయారై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది. నిత్యం వివిధ సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మండల ప్రజలు కార్యాలయాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా ఇదే మార్గం గుండా వందల సంఖ్యలో రైతులు, వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా అధికారులు సైతం ఈ మార్గం గుండానే వెళ్తుంటారు. సమస్య కళ్ళముందే ఉన్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై స్థానికులు, అటుపక్క వెళ్లే వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధికి కార్యాచరణే బాట

- ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ
- మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం
- సభ్యుల కలలు, గ్రామ సంఘాల లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- ఏపీయం శకుంతల



**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, గ్రామాల అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మోడల్ క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ (ఎంసీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో వీఓఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సభ్యుల వ్యక్తిగత కలలు, గ్రామ సంఘాల లక్ష్యాలను వచ్చే ★ఐదేళ్ల వార్షిక కార్యాచరణ ప్రణాళిక (యాన్యువల్ యాక్షన్ ప్లాన్)★లో పొందుపరిచి వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చే విధానంపై సవివరంగా అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ ప్రణాళిక కీలకమని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం శకుంతల, సీసీలు అబేద్, వీరచారి, స్వరూప, అనసూయ, అకౌంటెంట్ సాయిరెడ్డి, వీఓఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.




## వర్షాకాలంలో నాలాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### ముంపు నివారణకు నాలాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి
### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజా వాయిస్ హన్మకొండ** / కాకతీయ యూనివర్సిటీవర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాలాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.బుధవారం హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులోని అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీ (ఎస్పీఆర్ పాఠశాల సమీపం) వద్ద ఉన్న ప్రధాన నాలాలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షం కురుస్తున్నప్పటికీ టీవీ టవర్ కాలనీలో అధికారులతో కలిసి కాలినడకన వెళ్లి నాలాల పరిస్థితిని పరిశీలించి, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం గోపాల్‌పూర్ ఊర చెరువు వద్ద చేపట్టిన పూడికతీత పనులను, చెరువు కట్ట (బండ్) పరిస్థితిని పరిశీలించి, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నాలాల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి, నాలాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇరిగేషన్ డీఈ కిరణ్ కుమార్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, డీఈ సారంగం, ఏఈ అనిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఈదురుగాలులతో దెబ్బతిన్న అటవీ ప్రాంతాల పరిశీలన

- ప్రకృతి నష్టంపై ఆరా తీసిన కాకులమర్రి లక్ష్మణ్ బాబు
- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు.

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా;** మంగపేట మండలం, జూలై 29./ ములుగు జిల్లా మంగపేట మండలంలో టోర్నడో తరహా ఈదురుగాలులకు వందలాది చెట్లు నేలకూలిన ప్రాంతాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పరిశీలించారు. మంగపేట నుంచి కోమటిపల్లి వెళ్లే మార్గంలోని సంగ్రోని ఒర్రె, శాంతినగర్ సమీప అటవీ ప్రాంతాలను సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. మంగపేట రేంజ్ పరిధిలోని మంగపేట సెక్షన్, మంగపేట సౌత్ బీట్, కంపార్ట్‌మెంట్ నంబర్–5లో దుంపిడి, కానుగ, ముస్తి, ఈపీ తదితర జాతుల వృక్షాలు భారీ ఈదురుగాలుల ధాటికి నేలకూలిన విషయాన్ని అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో సంభవించే నష్టాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, దెబ్బతిన్న అటవీ సంపదను సంరక్షించాలని లక్ష్మణ్ బాబు సూచించారు. ఈ పరిశీలనలో కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, చిట్టీమల్ల సమ్మయ్య, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, బాడిశా నాగరమేష్, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, గాదె శ్రీనివాసాచారి, ఎస్.కె. కుర్బాన్ అలీ, యలవర్తి శ్రీనివాసరావు, సోయం ఈశ్వర్, భోజారావు, సుంకోజు ప్రశాంత్, సాంబులు, వంశీ, సంతోష్, మహేష్, మునిగేల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## కాలువలు కబ్జా.... ఇళ్లలోకి వరద

- వర్షం వస్తే జలదిగ్బంధమే
- ప్రతి ఏటా అడ్డగుంటపల్లికి ఇదే తీరని వ్యథ!
- ఆక్రమణలో మురుగు కాలువ?



**ప్రజా వాయిస్ గోదావరిఖని** చినుకు పడితే చాలు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని అడ్డగుంటపల్లి ప్రాంతం జలమయమవుతోంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఇక్కడ ముంపు తిప్పలు తప్పడం లేదని, ఎంతమొత్తుకున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థకు తోడు ఒక ప్రముఖ నాయకుడి ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం ఇక్కడి కాలువ తీవ్ర ఆక్రమణకు (కబ్జాకు) గురికావడమే ఈ భారీ ముంపునకు ప్రధాన కారణమని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సహజసిద్ధంగా నీరు పారే కాలువను ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో వర్షపు నీరు ముందుకు వెళ్లే మార్గం లేక రివర్స్ కొట్టి నివాస ప్రాంతాలను ముంచెత్తుతోంది.ఇళ్లలోకి ప్రమాదకర కీటకాలు... భయాందోళనలో స్థానికులు:వర్షం తీవ్రత ఎక్కువైతే డ్రెయిన్ నీరు, వర్షపు నీరు కలిసి నేరుగా ఇళ్లలోకి చేరుతోంది. డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో ఇళ్లలోని వస్తువులు తడిసి ముద్దవుతుండగా, వర్షపు నీటితో పాటు తేళ్లు, పాములు, ఇతర ప్రమాదకరమైన కీటకాలు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. చిన్నారులు, వృద్ధుల ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారిందని, రాత్రిపూట నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం:**

ప్రజాప్రతినిధుల కబ్జాలకు అధికారులు కొమ్ముకాస్తుండడం వల్లే సాధారణ ప్రజలు ఈ శిక్ష అనుభవించాల్సి వస్తోందని బాధితులు మండిపడుతున్నారు. ఏళ్లుగా ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా అధికారులు కళ్లప్పగించి చూడటమే తప్ప కబ్జాలను తొలగించే ధైర్యం చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రామగుండం కార్పొరేషన్ అధికారులు స్పందించి, ఆక్రమణకు గురైన కాలువను పునరుద్ధరించి, అడ్డగుంటపల్లిలో సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ముంపు ముప్పు నుంచి తమను శాశ్వతంగా కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పనులు ఎన్నో.. జీతాలు సున్నా..!

- మూడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి


**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:**మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పెద్ద శంకరంపేట మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నిరసనగా నిర్వహించిన సమీక్ష సమావేశాన్ని బహిష్కరించారు.ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ.. వీబీజీ రాంజీ (జలసిరి) పనులు, ఇందిరమ్మ ఇళ్ల ఫోటో క్యాప్చర్, కార్మికుల హాజరు నమోదు, వనమహోత్సవ కార్యక్రమాలు తదితర అనేక ప్రభుత్వ బాధ్యతలను నిరంతరం నిర్వర్తిస్తున్నప్పటికీ, మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు.ప్రభుత్వ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే గుర్తించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఇకపై వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.



## అంగన్‌వాడీ పోస్టులకు భారీగా దరఖాస్తులు

- పెద్ద శంకరంపేటలో టీచర్ పోస్టులకు అత్యధికంగా 194 దరఖాస్తులు
- జూలై 31 నుంచి ఆగస్టు 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన,
- నిర్దేశిత తేదీల్లో తప్పనిసరిగా హాజరుకావాలి
- సీడీపీవో పద్మలత





**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** ఐసీడీఎస్ అల్లదుర్గ్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్, మినీ టీచర్, హెల్పర్ (ఆయా) పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ పూర్తయినట్లు సీడీపీఓ పద్మలత తెలిపారు. ముఖ్యంగా శంకరంపేట–ఏ మండలంలో టీచర్ పోస్టులకు అత్యధికంగా 194 దరఖాస్తులు రావడం గమనార్హమని పేర్కొన్నారు.అధికారుల వివరాల ప్రకారం అల్లాదుర్గ్ మండలంలో టీచర్ పోస్టులకు 18, హెల్పర్ పోస్టులకు 24 దరఖాస్తులు, రేగోడ్ మండలంలో టీచర్ పోస్టులకు 25, హెల్పర్ పోస్టులకు 15 దరఖాస్తులు, శంకరంపేట–ఏ మండలంలో టీచర్ పోస్టులకు 194, హెల్పర్ పోస్టులకు 18 దరఖాస్తులు, టేక్మాల్ మండలంలో టీచర్ పోస్టులకు 15, హెల్పర్ పోస్టులకు 38 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు.అంగన్‌వాడీ టీచర్, మినీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, షెడ్యూల్ కూడా విడుదలైంది. జూలై 31న టేక్మాల్ , అల్లదుర్గ్, ఆగస్టు 1న శంకరంపేట–ఏ, ఆగస్టు 3న రేగోడ్ మండలాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీవో పద్మలత తెలిపారు.అభ్యర్థులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని అధికారులు సూచించారు.




## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన షాబాద్ సిఐ లక్ష్మీ రెడ్డి, ఎస్సై చెన్నారెడ్డి

- మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి

**(ప్రజా వాయిస్ షాబాద్)**షాబాద్ పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ రెడ్డి, అలాగే ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన చెన్నారెడ్డిలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి మరియు బీసీ సేన షాబాద్ మండల యువజన విభాగం అధ్యక్షుడు బండ అజేయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన అధికారులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ మరియు ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ చేసే అన్ని మంచి కార్యక్రమాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి రెడ్డి, న్యాలట ఆనంద్, బండి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడలో వైద్యరంగానికి కొత్త అధ్యాయం

- **జ్యోతి హాస్పిటల్‌లో తొలి ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ విజయవంతం**
- **ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా క్లిష్ట శస్త్రచికిత్స**
- **హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండానే స్థానికంగా అత్యాధునిక గుండె వైద్యం**
- **30 ఏళ్ల సేవలకు మరో మైలురాయి**

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ**.మిర్యాలగూడ వైద్యరంగ చరిత్రలో జ్యోతి హాస్పిటల్ మరో అరుదైన ఘట్టాన్ని నమోదు చేసింది. మూడు దశాబ్దాలుగా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించిన ఈ ఆసుపత్రిలో తొలిసారిగా అత్యంత క్లిష్టమైన ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఇప్పటివరకు ఇలాంటి చికిత్స కోసం హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నుంచి మిర్యాలగూడ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపశమనం లభించింది.ఈసందర్భంగా జ్యోతి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సర్జన్ మువ్వా రామారావు మాట్లాడుతూ వీర్లపాలెం గ్రామానికి చెందిన 61 ఏళ్ల మహిళ తీవ్ర గుండెనొప్పితో ఆసుపత్రిలో చేరగా, వైద్య పరీక్షల్లో గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో తీవ్రమైన బ్లాకులు ఉన్నట్లు మా డాక్టర్స్ గుర్తించారు. వెంటనే శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించిన వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా తెలియజేసిన వైద్యులు జూలై 20న కార్డియో థొరాసిక్ సర్జరీ (CTVS) విభాగం ఆధ్వర్యంలో ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ నిర్వహించారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి వేగంగా కోలుకుని ఐదో రోజే డిశ్చార్జ్ చేయడం మరొక అద్భుతం అని డాక్టర్స్ ప్రశంశలను కొనియాడారు.ఈ ఖరీదైన చికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పూర్తిగా ఉచితంగా అందించడం మరో విశేషంగా నిలిచిందన్నారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కూడా అత్యాధునిక గుండె వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు.ఈ శస్త్రచికిత్స కోసం అత్యాధునిక హార్ట్-లంగ్ మెషిన్, హీటర్-కూలర్ సిస్టమ్, మైక్రో కార్డియాక్ ఇన్‌స్ట్రుమెంట్స్ వినియోగించారు. దాదాపు 25 మందికి పైగా వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్లు సమన్వయంతో పనిచేసి ఈ క్లిష్ట ఆపరేషన్‌ను విజయవంతం చేశారు.శస్త్రచికిత్సలో సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ రమేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, కార్డియాక్ అనస్థీషియా & క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ లావణ్య కడిమి, డాక్టర్ కృష్ణ చక్ర, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మువ్వా రామారావు, కో-ఫౌండర్ డాక్టర్ జీవన జ్యోతి, డాక్టర్ మువ్వా శ్రీహర్షతో పాటు కార్డియాక్ స్టాఫ్, ఆరోగ్య మిత్రలు, సపోర్ట్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు.మిర్యాలగూడతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అత్యాధునిక గుండె వైద్యసేవలను అందించాలన్న సంకల్పంతోనే ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.ప్రజల విశ్వాసం, సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను విస్తరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు






# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కాకతీయ జూ పార్కులో అవగాహన కార్యక్రమం**

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం అత్యంత అవసరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కులో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పులి వన్యప్రాణుల్లో అత్యంత కీలకమైన జాతి అని, అడవుల పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పులుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఒకప్పుడు పులుల వేట విస్తృతంగా జరిగేదని, అటవీశాఖ చేపట్టిన కఠిన చర్యలతో అక్రమ వేట గణనీయంగా తగ్గి, దేశంలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు.దేశంలో చిరుతల (చీతాలు) సంఖ్య తగ్గిపోవడంతో వాటిని ఇతర ఖండాల నుంచి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోని కవ్వాల్ పులుల అభయారణ్యంలో ప్రస్తుతం ఒక్క పులి కూడా లేకపోవడం ఆందోళనకరమని, అదే సమయంలో సమీపంలోని మహారాష్ట్ర తడోబా అభయారణ్యంలో పులుల సంఖ్య గణనీయంగా ఉందని తెలిపారు.అడవులు, వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని, వాటి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి మాట్లాడుతూ, అంతరించిపోతున్న పులులతో పాటు ఇతర వన్యప్రాణులను సంరక్షించడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటి నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని తెలిపారు. భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలంటే విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు మయూరి, శిరీష, శ్రీనివాస్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధి శ్యామ్ సుందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఒకే తరగతి గదిలో రెండు తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- **ఉపాధ్యాయులకు శిక్షణ వేసవిలో నిర్వహించాలి, ఇప్పుడు నిర్వహించడం వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది**
- **సిపిఎం మండల కమిటీ**



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, సిపిఎం పార్టీ పాన్గల్ మండల కమిటీ ఆధ్వర్యంలో చింతకుంట, రాయన్ పల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో సిపిఎం పార్టీ మండల నాయకులు, భీమయ్య, దేవేందర్, సూర్యవంశం రాము, బుధవారం సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ,, భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్న నేటికీ విద్యార్థులు చదువుకోవడం కోసం గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలకు సరిపడా తరగతి గదులు లేకపోవడం అన్యాయమన్నారు, విద్యార్థులకు విద్యను బోధించడం కోసం ఉపాధ్యాయులు కూడా సరిపడలేరని ఆవేదన వ్యక్తం చేశారు, ఒకే తరగతి గదిలో రెండు తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడడం అన్యాయం అన్నారు, తక్షణమే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించాలని, అవసరమైన పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి ,ప్రభుత్వ విద్యను కాపాడాలని అన్నారు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలని అన్నారు, ప్రభుత్వం పాఠశాలలు నడుస్తున్న సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణ పేరుతో సమయాన్ని వృధా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు, ఉపాధ్యాయులకు శిక్షణ హాలిడేస్ లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు, మధ్యాహ్నం భోజనం చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం సిలిండర్ల మీద వంట చేయాలని ఆర్డర్లు జారీ చేస్తుంది కానీ సిలిండర్లకు అమౌంట్ ఇవ్వడం లేదని అన్నారు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, గుడ్డుకు ఎనిమిది రూపాయలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, పాఠశాలలు ప్రారంభమై 45 రోజులు దాటిన ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రభుత్వం 150 మంది విద్యార్థులు ఉన్నచోటే వీటిని ఏర్పాటు చేస్తామని అనడం ఉందని అన్నారు తక్షణమే అన్ని ప్రభుత్వ పాఠశాలలో పి ఈ టిలను ఏర్పాటు చేయాలని అన్నారు, రాయినపల్లి, బుసిరెడ్డిపల్లి, గ్రామంలో విద్యార్థులకు తరగతి గదులు లేక రెండు క్లాసులను కలిపి ఒకే చోట విద్య బోధిస్తున్నారని అన్నారు, చింతకుంట గ్రామంలో రూమ్స్ లేక మెట్ల క్రింద, రెండు తరగతి గదులను కలిపి ఒకే రూములో విద్యను బోధిస్తున్నారని అన్నారు, పాన్గల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న పాఠశాలలో సమస్యలపై ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, లేని యెడల మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న విద్యార్థులను ప్రజలను సమీకరణ చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గ్రామాల్లో విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు




# వలస ఓటర్ల గుర్తింపుకు చర్యలు

- **వికారాబాద్ జిల్లాలో 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి**
- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వెల్లడి**

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** జిల్లాలో 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు.మంగళవారం ప్రత్యేక సమగ్ర సవరణ పై జిల్లాల వారీగా ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎ.ఎస్.డి(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) కేసులను గుర్తించి గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో ప్రదర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వికారాబాద్, తాండూర్ లలో వలస ఓటర్లు ఎక్కువగా ఉండడం వల్ల అటువంటి వాటిని కూడా ప్రత్యేకంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన కలెక్టర్ తెలిపారు.కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటా చారి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ)సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా రెవెన్యూ అధికారి స్వర్ణలత, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ తదితరులు ఉన్నారు.




# పాత పెన్షన్ అమలు చేయాలి..!

- **ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి**
- **గంగాపురం స్థితప్రజ్ఞ**
- **సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**
- **పోస్టల్ బ్యాలెట్‌తో 16 స్థానాల్లో విజయం**
- **సిపిఎస్ ఉద్యోగుల మద్దతు మరువొద్దు**

**ప్రజా వాయిస్ ములుగు జిల్లా, జూలై 29:**/ పాత పెన్షన్‌ను వెంటనే పునరుద్ధరించి ఎన్నికల హామీని అమలు చేయాలని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎస్ ఉద్యోగుల సంఘం చేపట్టిన జనజాగరణ యాత్ర ములుగు జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్కను కలిసి పాత పెన్షన్ అమలుపై వినతిపత్రం సమర్పించారు. తదనంతరం నిర్వహించిన సభలో గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాంగ్రెస్ 16 స్థానాల్లో విజయం సాధించిందని, ఆ విజయానికి సిపిఎస్ ఉద్యోగుల సహకారం కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ అమలు చేసి ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అన్నవరం రవికాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొనగా, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. భారీ వర్షాన్ని లెక్కచేయకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై జనజాగరణ యాత్రను విజయవంతం చేశారు.

# నత్తనడకన సాగుతున్న వనమహోత్సవం..!

- **ఆశించిన స్థాయిలో ముందుకు సాగని కార్యక్రమం**
- **ఇప్పటికే రెండు నెలల వర్షాకాలం పూర్తి**
- **ముగింపు దశకు చేరుకున్న సీజన్**
- **లక్ష్యానికి దూరంగా వనమహోత్సవం**
- **పెద్దేముల్ మండల అధికారుల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి**



**ప్రజావాయిస్/తాండూర్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో వనమహోత్సవ కార్యక్రమం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం క్షేత్రస్థాయిలో మందగించిందని, అధికారుల పర్యవేక్షణ లోపించిందని స్థానికులు విమర్శిస్తున్నారు.ఇప్పటికే రెండు నెలల వర్షాకాలం పూర్తవగా, ప్రస్తుతం సీజన్ ముగింపు దశకు చేరుకుంది. అయినప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో మొక్కల నాటకం నత్తనడకన సాగుతుండటంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు ఎలా పూర్తవుతాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అనేక గ్రామాల్లో మొక్కల నాటకం పూర్తికాకపోవడం, నాటిన మొక్కలకు తగిన సంరక్షణ లేకపోవడం, పర్యవేక్షణ సరిగా జరగకపోవడం వంటి అంశాలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వనమహోత్సవం విజయవంతం కావాలంటే అధికారులు గ్రామాల వారీగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతిరోజూ పురోగతిని సమీక్షించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అలాంటి చురుకుదనం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మొక్కలు నాటడమే కాకుండా వాటికి నీటి సౌకర్యం కల్పించడం, రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, పశువుల బారి నుంచి కాపాడడం వంటి చర్యలు కూడా సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.వర్షాకాలం మొక్కలు నాటేందుకు అత్యంత అనుకూలమైన సమయం. అలాంటి సమయంలో కార్యక్రమం మందగించడం వల్ల ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరుతాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి గ్రామాల వారీగా పురోగతిని పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**మొక్కల్ని సంరక్షిస్తేనే వనమహోత్సవం సార్థకం.**

వనమహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదు. నాటిన ప్రతి మొక్కను చెట్టుగా పెంచడమే అసలు లక్ష్యం. మొక్కలు నాటిన తర్వాత వాటికి క్రమం తప్పకుండా నీరు పోయడం, పశువుల నుంచి రక్షణ కల్పించడం, అవసరమైతే రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, ఎండిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటడం వంటి చర్యలు తీసుకోవాలి.వనమహోత్సవం భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించే బాధ్యత అని గుర్తించి సంబంధిత అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మద్యం మత్తులో అతివేగంగా దూసుకొచ్చిన కారు

- **ఒక వ్యక్తి మృతి**
- **శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**శామీర్ పేట జూలై 29 ( ప్రజా వాయిస్ ):** మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అనంతారం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన వెలుగుచూసింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన షేక్ జమీల్ మంగళవారం (28-07-2026) రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో తన టీవీఎస్ ఎక్స్. ఎల్. ద్విచక్ర వాహనంపై కిరాణా దుకాణానికి వెళ్లి, సామాన్లు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వస్తుండగా, ఇంటికి కొద్ది దూరంలో ఎదురుగా క్షీరసాగరం వైపు నుంచి లక్ష్మాపూర్‌కు చెందిన కావలి మల్లేష్ మద్యం మత్తులో తన కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా, రాంగ్‌రూట్‌లో నడుపుకుంటూ వచ్చి జమీల్ వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో జమీల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆర్.వి.ఎం. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం.మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.





# గుంతలుగా మారిన రోడ్లు, వరి నారు నాటిన కాలనీ ప్రజలు

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిది** హన్మకొండ లోని డబ్బాలు ప్రాంతంలోని రోడ్లు గుంతలతో, వర్షపు నీటితో నిండి ఉండటంవల్ల వాహనదారులు, ప్రాధాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీటి నిలువ వల్ల గుంతలు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని, నేడు 54వ డివిజన్ వాసులు, పేరం గోపికృష్ణ ఆధ్వర్యంలో వరి నాట్లు నాటి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చొరవచూపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ముమ్మరంగా కొనసాగుతున్న మాస్టర్ ప్లాన్ ప్రక్రియ

- రహదారుల అక్రమాణాలపై కొనసాగుతున్న విస్తరణ తనిఖీల వైనం..
- 40 ఫీట్లు అడుగుల రహదారి విస్తరణలపై మున్సిపల్ కమిషనర్ తనిఖీలు
- నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ

**ప్రజా వాయిస్ జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా భవాని మందిర్ రోడ్, హనుమాన్ మందిర్ రోడ్డలల్లో ప్రతిపాదిత 40 ఫీట్లు అడుగుల రహదారి వెడల్పు మేర ఆక్రమణలను గుర్తించేందుకు బుధవారం మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.అదేవిధంగా ఈ తనిఖీల్లో టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ రావు, టీపీఎస్ మంజు భార్గవి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్ని మాస్టర్ ప్లాన్ ప్రకారం రహదారి అలైన్‌మెంట్‌ను పరిశీలించిన అధికారులు, ప్రతిపాదిత 40 అడుగుల రహదారి పరిధిలో ఉన్న ఆక్రమణలను గుర్తించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, పట్టణ అభివృద్ధికి అనుగుణంగా రహదారులను ఆక్రమణల రహితంగా ఉంచేందుకు చర్యలు కొనసాగుతాయని మున్సిపల్ అధికారులు తెలిపారు.



## సీజనల్ వ్యాధులపై సైరన్

- ఆస్పత్రుల్లో కుక్కకాటు మందులు తప్పనిసరి.!
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో యాంటీ రేబీస్ మందులు అందుబాటులో ఉంచాలి
- హాస్టళ్ల తనిఖీలు, ప్రత్యేక వైద్య శిబిరాలు ముమ్మరం చేయాలి
- నిర్లక్ష్యంపై కఠిన చర్యలు
- డీఎంహెచ్ వో డాక్టర్ తుకారం రాథోడ్

**ప్రజా వాయిస్,భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ వైద్యాధికారులను ఆదేశించారు. జూమ్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలో కుక్కకాటు (యాంటీ రేబీస్) మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, కుక్కకాటు కేసుల పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. హాస్టళ్లలో పక్షం రోజులకోసారి ఆరోగ్య తనిఖీలు, విద్యార్థులకు వైద్య శిబిరాలు నిర్వహించాలని, గ్రామాల్లో జ్వరం, విరేచనాలు, వాంతులు తదితర లక్షణాలపై ఆశా, ఆరోగ్య కార్యకర్తలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





## దేవురుప్పుల మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- చిన్న మడూర్ - రాంబోజి గూడెం గ్రామాల మధ్య 10 కోట్ల 80 లక్షల వ్యాయం తో నిర్మించిన ఉన్నత స్థాయి వంతెన
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాను
- పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపే అందుకు నిరంతరం కృషి చేస్తాను
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**ప్రజా వాయిస్/జనగామ** (దేవరుప్పుల) దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి లక్ష్మణ్ తండా మాదాపురం దుబ్బ తండ గ్రామంలో గ్రామాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తూ పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, చిన్నారులకు నాణ్యమైన అంగన్‌వాడీ సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా అప్పిరెడ్డిపల్లిలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, అలాగే రూ.12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. దేవరుప్పుల మండలం మాదాపురం గ్రామంలో 20 లక్షల వ్యయాంతో సిసి సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చేశారు. లక్ష్మణ్ తండాలో 20 లక్షల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దుబ్బ తండాలో హరితరానికి వాటర్ ప్లాంట్ కు 20 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు ఈ పనులు పూర్తయిన తర్వాత గ్రామంలో రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారును ఉన్నాయని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో మెరుగైన రహదారులు, చిన్నారులకు సౌకర్యవంతమైన అంగన్‌వాడీ భవనాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

### ప్రభుత్వ విద్యకు పెరుగుతున్న ఆదరణకు మాదాపురం ఎంపీపీఎస్ నిదర్శనం

దేవుడు పూల మండలం మాదాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎంపీపీ ఎస్ లను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య ప్రమాణాలు మౌలిక సదుపాయాలు బోధన విధానాలను పరిశీలించి ఉపాధ్యాయులు విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యల ఫలితంగానే మాదాపురం ఎంపీపీ ఎస్ జిల్లాలో ఆదర్శ ప్రభుత్వ పాఠశాలగా ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందడం అభినందనీయమని అన్నారు. కేవలం 20 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాలలో ప్రస్తుతం 143 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేయడము ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు అంకితభావమే ఈ విజయానికి కారణమని కొనియాడారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి విద్యార్థుల భవిష్యత్తు కోసం వారు చేస్తున్న సేవలను ప్రశంసించారు అలాగే పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు ఇతర అవసరాల కోసం తన వంతు సహకారం అందిస్తానని అవసరమైన నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులతో సమీక్ష సమావేశం

- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి మండల స్పెషల్ అధికారి లక్ష్మప్ప



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా** వనపర్తి జిల్లాపెబ్బేరుకు సమీపంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మండల స్పెషల్ అధికారి లక్ష్మప్ప అధ్యక్షత వహించగా, ఎంపీడీవో శ్రీనివాస రావు సర్పంచులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడంతో పాటు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచులకు సూచించారు.గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.అనంతరం ఆయా గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ శాఖ ద్వారా విత్తనాల సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం పనులు, ఉద్యానవన శాఖ (హార్టికల్చర్) పథకాల అమలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సర్పంచులు అడిగిన ప్రశ్నలకు వివరంగా సమాధానాలు ఇచ్చారు.మండల స్పెషల్ అధికారి లక్ష్మప్ప మాట్లాడుతూ,,, గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే సిద్ధం చేసి అమలు దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి 45 రోజులకు ఒకసారి మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, అప్పటివరకు సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై జె. నరేష్ కుమార్ మాట్లాడుతూ,,, మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే 7 గ్రామపంచాయతీల్లో సర్పంచుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, మిగిలిన గ్రామపంచాయతీల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రతి సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండడంతో పాటు సీటుబెల్ట్, హెల్మెట్ ధరించాలని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.సైబర్ నేరాల పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద సందేశాలు, ఓటీపీలు లేదా బ్యాంకు వివరాలు కోరే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే బాధ్యతను కూడా సర్పంచులు తీసుకోవాలని ఎస్సై నరేష్ కుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.డి. ఖాజా మైనుద్దీన్, మండల విద్యాధికారి నరసింహ, విద్యుత్ శాఖ ఏఈ భగవంతు నాయక్, వివిధ శాఖల ఏఈలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు పల్సర్ రామన్ గౌడ్, ఉపాధ్యక్షుడు బాలరాజు, సర్పంచులు పానుగంటి శ్రీదేవి, మీసాల పార్వతి, దొడ్ల కవిత, పళ్ల జయంతి, సురజలక్ష్మి , శివమ్మ, ముంత జ్యోతి, సుదర్శన్ రెడ్డి, బండారి రాముడు, గోపి, వెంకటేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు దర్గా, రమేష్ రెడ్డి, శ్యాంసుందర్, నాగరాజు, వహీద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## షాపూర్‌నగర్‌లో పేదల దుకాణాలపై బుల్డోజర్

- నోటీసు లేకుండానే నేలమట్టం
- 12 చిన్న దుకాణాల కూల్చివేతపై పుప్పాల భాస్కర్ ఆగ్రహం
- బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద జోక్యంతో చర్యలకు హామీకుత్బుల్లాపూర్,



**ప్రజా వాయిస్: షాపూర్‌నగర్** రాజీవ్ పార్క్ సమీపంలో పూర్తిగా మూసివేసిన రహదారి ఇరువైపులా ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదల దుకాణాలను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేయడంపై బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలో సుమారు 12 దుకాణాలు పూర్తిగా ధ్వంసం కావడంతో పలువురు చిన్న వ్యాపారులు జీవనాధారాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.సంఘటన సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకుడు అన్వర్ వెంటనే పుప్పాల భాస్కర్‌కు సమాచారం అందించగా, ఆయన ఘటనాస్థలికి చేరుకుని బాధిత వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అధికారుల వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుబట్టారు.అనంతరం ఈ అంశాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి బాధిత చిన్న వ్యాపారులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, ముందస్తు నోటీసులు లేకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా పేదల జీవనాధారాన్ని బుల్డోజర్లతో ధ్వంసం చేయడం అమానుషం. వీధి వ్యాపారుల హక్కులను ప్రభుత్వం కాపాడాలి. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుంది" అని స్పష్టం చేశారు.



## తెల్ల బెల్లం చాటున.. నల్లబెల్లం దందా..!

- మోతెలో బహిరంగంగా అక్రమ బెల్లం రవాణా
- లారీల కొద్దీ దిగుమతులపై గ్రామస్తుల ఆగ్రహం
- మామూళ్ల మత్తులో అధికారులు అన్న ఆరోపణలు
- నల్ల బెల్లం సరఫరా చేసినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవు
- ఎక్సైజ్ ఎస్సై సురేందర్ హెచ్చరిక

**ప్రజా వాయిస్,మోతె:** సూర్యాపేట జిల్లా మోతే మండల కేంద్రంలో తెల్ల బెల్లం వ్యాపారం మాటున నల్ల బెల్లం అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. లారీల కొద్దీ నల్ల బెల్లాన్ని బహిరంగంగా వ్యాపారి ఇంటి వద్ద దింపుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టపగలే భారీగా బెల్లం లోడ్లు దిగుతున్నా తనిఖీలు లేకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల కథనం ప్రకారం, గతంలో నాటు సారా తయారీదారులకు తరలిస్తున్న నల్ల బెల్లాన్ని ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్న ఘటనలో స్వాధీనం చేసుకున్న బెల్లం మాయమైందన్న ఆరోపణలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఆ వ్యవహారంలో మధ్యవర్తుల ద్వారా రూ.30 వేల లావాదేవీలు జరిగాయన్న ప్రచారం పెద్ద దుమారానికే దారితీసిందని స్థానికులు గుర్తు చేస్తున్నారు.ఇదిలా ఉండగా, అధికారులు సారా విక్రయదారులపై మాత్రమే చర్యలు తీసుకుంటూ, సారా తయారీకి మూలమైన నల్ల బెల్లం సరఫరాదారులపై మాత్రం ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బెల్లం వ్యాపారులపై కట్టుదిట్టమైన నిఘా పెడితే గుడుంబా తయారీని గణనీయంగా అరికట్టవచ్చని అభిప్రాయపడుతున్నారు.తెల్ల బెల్లం రవాణాకు ఉన్న అనుమతులను అడ్డుగా పెట్టుకుని, అదే లోడ్లలో రహస్యంగా నల్ల బెల్లాన్ని సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో గ్రామాలకు నల్ల బెల్లం చేరుతుండటంతో అక్రమ సారా తయారీకి మరింత ఊతం లభిస్తోందని సమాచారం. తక్కువ ధరలు, రవాణాపై పెద్దగా తనిఖీలు లేకపోవడం కూడా ఈ అక్రమ వ్యాపారానికి అనుకూలంగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

### నల్ల బెల్లాన్ని సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



నల్ల బెల్లాన్ని సరఫరా చేసినా, కొనుగోలు చేసినా సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. అక్రమ వ్యాపారంపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.

**మోతే ఎక్సైజ్ ఎస్సై సురేందర్**

## అంతర్జాతీయ పులుల దినోత్సవంపురస్కరించుకొని విద్యార్థుల్లో పులుల సంరక్షణపై అవగాహన

- .రేంజ్ ఆఫీసర్ వంశీ

**ప్రజా వాయిస్ కొత్తగూడ**, అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడ మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పులుల సంరక్షణ – అడవులకు వాటి ప్రాముఖ్యతఅనే అంశంపై వ్యాసరచన పోటీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విశేష ఉత్సాహంతో పాల్గొని పులుల పరిరక్షణపై తమ అవగాహనను, ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు.పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయగా, పాల్గొన్న మిగతా విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు.ఈ సందర్భంగా కొత్తగూడ రేంజ్ ఆఫీసర్ వంశీ మాట్లాడుతూ, పులులు అడవుల సమతుల్య వ్యవస్థకు అత్యంత కీలకమైన జీవులని అన్నారు. పులులు ఉంటేనే అడవులు ఆరోగ్యంగా ఉంటాయని, అడవులు బాగుంటేనే ప్రకృతి సమతుల్యత, వర్షపాతం, జీవవైవిధ్యం పరిరక్షించబడతాయని వివరించారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని, అడవులు, వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పులుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యార్థులే ముఖ్య పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థుల్లో ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై బాధ్యతాయుతమైన భావన పెంపొందించేందుకు అటవీ శాఖ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుందని రేంజ్ ఆఫీసర్ వంశీ తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.



# ఆకేరును మింగేస్తున్న 'అధికార' అండ!

- ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ లో బడి నిర్మాణం
- నిబంధనలు గాల్లోకి!
- అధికారులకు అవగాహన లేదా? అమ్యామ్యాల మైకమా?
- శ్రీ చైతన్య పేరుతో పేద విద్యార్థులను,ప్రజలను మోసం చేస్తున్న యాజమాన్యం
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న విద్యాశాఖ అధికారుల తీరు
- సరిహద్దుదారులకు వాగును రాసిచ్చేస్తున్న నీటిపారుదల, రెవెన్యూ శాఖలు!
- ఆకేరు వాగు అభివృద్ధి చెందాలని ప్రగల్భాలు పలికే ఎమ్మెల్యేకు కానరాని కబ్జా..
- ఉన్నతాధకారులు స్పందించి ఆకేరు వాగును కాపాడాల్సిందిగా స్థానిక పట్టణవాసుల డిమాండ్..








**ప్రజా వాయిస్ వరంగల్:** ఒకప్పుడు ఎండకాలంలోనూ సవ్వడులు చేస్తూ, చుట్టుపక్కల పొలాలకు జీవధారగా నిలిచిన ఆకేరు వాగు ఉనికి ఇప్పుడు ప్రమాదంలో పడింది. కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే కళ్ళప్పగించి చూస్తుండటంతో ఆకేరు వాగు కబ్జాకోరల్లో చిక్కుకుని రోజురోజుకూ కుంచించుకుపోతోంది. వాగు పరిధిలోని ఎఫ్‌టిఎల్ , బఫర్ జోన్ నిబంధనలను బొందపెడుతూ ఏకంగా బడి నిర్మాణ పనులు చేపడుతున్నా సంబంధిత శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర కలకలం రేపుతోంది.

### వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పాఠశాల యాజమాన్యానికి మధ్య ఒప్పందాలు..??

వర్ధన్నపేట కేంద్రంగా శ్రీ చైతన్య పాఠశాల పేరుతో చుట్టుపక్కల ప్రజలను మోసం చేస్తూ అరబిందో పాఠశాల లో విద్యాక్రమణ జరుగుతోంది..శ్రీ చైతన్య పేరుతో అడ్మిషన్ల.ప్రక్రియ చేస్తూ చివరగా ఆరంబిందో పేరుతో సర్టిఫికెట్లు జారీ చేస్తూ పాఠశాల యాజమాన్యం పేద విద్యార్థులను,ప్రజలను ఆసరాగా చేసుకొని అధిక సంఖ్యలో ఫీజులు వసూలు చేస్తూ మోస పూరితమైన విద్యావిధానాన్ని అమలుచేస్తున్నారని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా ఆ పాఠశాలకు వందల సంఖ్యలో విద్యార్థులు వస్తున్న ప్రతి విద్యార్థి ప్రాణాపాయ స్థితిలోనే చదవాల్సిన దుస్థితి నెలకొంది.పాఠశాలకు సరైన కొలతలతో కూడిన నిర్దేశిత ప్రమాణాలు లేకుండా ఉండటంతో ఆకేరు వాగును కబ్జాచేసి ప్రహరీ నిర్మాణం చేపట్టారని దీంతో ఆకేరులోకి నీటి ప్రవాహం పెద్ద ఎత్తున చేరటంతో చెక్ డ్యాం నిర్మాణాలు కొట్టుకు పోతున్నాయని స్థానిక మేధావులు అభిప్రాయ పడుతున్నారు.దీంతో ఈ తతంగం ఎమ్మెల్యేకి తెలిసే జరిగిందని అభిప్రాయ పడుతున్నారు పట్టణ వాసులు..

### అధికారులకు నిబంధనలు తెలియవా లేక మామూళ్ల మత్తులో ఉన్నారా?

వాగులు, వంకలు, నదుల సంరక్షణకు సంబంధించి స్పష్టమైన ప్రభుత్వ జీవోలు, హరిత తీర్పులు ఉన్నాయి. నీటి పారుదల పరివాహక ప్రాంతాల్లో, బఫర్ జోన్లలో ఎలాంటి శాశ్వత కట్టడాలు చేపట్టకూడదని నిబంధనలు బిగ్గరగా చెబుతున్నాయి. కానీ వర్ధన్నపేటలో మాత్రం ఈ చట్టాలు చెత్తబుట్టకే పరిమితమయ్యాయి. అసలు అధికారులకు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధులపై ప్రాథమిక అవగాహన లేదా? లేక ఆక్రమణదారుల నుంచి అందిన అమ్యామ్యాల మైకంలో చట్టాలను పక్కనబెట్టేశారా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.ఆకేరు వాగు సరిహద్దుల్లో ఉన్న కొందరు భూస్వాములు, రియల్టర్లు వాగు భూమిని తమ సొంత ఆస్తిలా ఆక్రమించుకుంటుంటే అధికారులు వారికి అనుకూలంగా వ్యవహరించడం వెనుక ఉన్న అసలు రహస్యమేమిటి? సహజ సిద్ధమైన నీటి ప్రవాహాన్ని అడ్డుకుని, బఫర్ జోన్‌ను సైతం ఆక్రమించి బడి నిర్మాణాలు చేపడుతుంటే నీటి పారుదల (Irrigation), రెవెన్యూ శాఖల అధికారులు మౌనం వహించడం వెనుక ఎంతటి మామూళ్ల పర్వం నడిచిందో స్పష్టమవుతోంది. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రక్షకులే, ఆక్రమణదారులకు భక్షకులుగా మారి వాగును సరిహద్దు దారులకు రాసిచ్చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఏది ఏమైనా భవిష్యత్తులో వరదలు వస్తే వర్ధన్నపేట ప్రాంతం మునిగిపోయే ప్రమాదం ఉందని తెలిసినా, ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులు చూపుతున్న అలసత్వం క్షమించరానిది. ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఆకేరు వాగు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ సరిహద్దులను వెంటనే రీ-సర్వే చేయించాలనీ పట్టణ వాసులు ఉన్నత అధికారులను కోరుతున్నారు.ఆక్రమణదారులకు అండగా నిలిచి, మామూళ్ల మత్తులో జోగుతున్న సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.ఆకేరు వాగు ఉనికిని కాపాడటంతో పాటు, భవిష్యత్ తరాలకు ముప్పు రాకుండా ఉండాలంటే తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

---

## ఎమ్మార్పీఎస్ పేరును అనధికారికంగా ఉపయోగించవద్దు..?

- ఎమ్మార్పీఎస్ అనేది పదవుల కోసం కాదు మాదిగల హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తున్న ప్రజా ఉద్యమ సంస్థ
- మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ




**ప్రజా వాయిస్ ఎల్కతుర్తి** ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) పేరును వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎవరూ దుర్వినియోగం చేయవద్దని ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల కోఆర్డినేటర్ అడ్డూరి అనిల్ మాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఎమ్మార్పీఎస్ అనేది పదవుల కోసం లేదా వ్యక్తిగత లబ్ధి కోసం పనిచేసే సంస్థ కాదని, సామాజిక న్యాయం, మాదిగల హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తున్న ప్రజా ఉద్యమ సంస్థ అని తెలిపారు. కేవలం నల్ల కండువా ధరించినంత మాత్రాన లేదా తమను తాము ఎమ్మార్పీఎస్ నాయకులుగా ప్రకటించుకున్నంత మాత్రాన ఎవరూ ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కాలేరని స్పష్టం చేశారు.ఎమ్మార్పీఎస్ తరఫున నిర్వహించే ప్రతి కార్యక్రమం, ఉద్యమం, ప్రకటన లేదా కార్యాచరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకే జరుగుతుందని తెలిపారు. అధికారికంగా నియమితులైన నాయకులు, బాధ్యుల ద్వారానే సంస్థ నిర్ణయాలు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ఎమ్మార్పీఎస్ పేరును వినియోగించడం ఉద్యమానికి, సంస్థకు నష్టం కలిగించే చర్య అని అన్నారు. అలాంటి వారిని ఉద్యమ కార్యకర్తలు, మాదిగ సమాజ సభ్యులు గుర్తించి అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అధికారిక నాయకత్వం ఇచ్చే పిలుపు మేరకే కార్యక్రమాల్లో పాల్గొనాలని, సంస్థ విడుదల చేసే అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని అడ్డూరి అనిల్ మాదిగ విజ్ఞప్తి చేశారు.చివరగా, ఎమ్మార్పీఎస్ ఉద్యమం బలోపేతానికి ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలని, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక న్యాయం సాధనే ఉద్యమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

---



## సినారె సాహిత్య వైభవం చిరస్మరణీయం

- గురు పరంపరకు వ్యాసుడు ఆద్యుడు
- జప్తి వీరప్పగూడెం జెడ్పీహెచ్ ఎస్ లో సినారె 95వ జయంతి
- గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహణ.
- విద్యార్థులు మహనీయుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయుల పిలుపు

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ** .మిర్యాలగూడ మండలం జప్తి వీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) 95వ జయంతి వేడుకలను గురు పూర్ణిమ సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినారె, వేదవ్యాస మహర్షి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు గుడిపాటి కోటయ్య మాట్లాడుతూ, సినారె తన సాహిత్య సృష్టితో తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారని అన్నారు. ఆయన రచనల్లో కనిపించే శబ్దశక్తి, అర్థయుక్తి సాహిత్యాభిమానులను8 విశేషంగా ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. 'ఆధునికాంధ్ర కవిత్వం – సాంప్రదాయాలు, ప్రయోగాలు' అనే ఆయన సిద్ధాంత గ్రంథం నేటికీ ప్రామాణిక గ్రంథంగా నిలవడం ఆయన మేధస్సుకు నిదర్శనమన్నారు.సినారె సినీ సాహిత్యంలోనూ చెరగని ముద్ర వేశారని, "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని" నుంచి "జేజమ్మ" వరకు వందలాది చిరస్మరణీయ గీతాలను అందించి సినీ కవిగా అపార ఖ్యాతి పొందారని చెప్పారు. ప్రపంచ సాహిత్య సమ్మేళనాల్లో తెలుగు భాష ప్రతినిధిగా పాల్గొని తెలుగు కీర్తిని ప్రపంచానికి చాటారని గుర్తు చేశారు. తెలంగాణ మట్టివాసనను తన సాహిత్యంలో నింపిన మహాకవిగా సినారె నిలిచారని, ఆయన సాహిత్య స్ఫూర్తిని నేటి యువత, యువ రచయితలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.గురు పూర్ణిమ సందర్భంగా వేదాలను విభజించి భారతీయ గురు పరంపరకు ఆద్యుడిగా నిలిచిన వేదవ్యాస మహర్షికి ఘనంగా నివాళులర్పించారు. గురువు స్థానం భారతీయ సంస్కృతిలో అత్యున్నతమని, విద్యార్థులు వ్యాస మహర్షి బోధించిన జ్ఞానమార్గాన్ని అనుసరించి విద్య, విలువలు, సంస్కారాలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎడవల్లి దామోదర్ రెడ్డి, పి. జగదీశ్వర్ రెడ్డి, ఒట్టె మాధవి, టి. శ్రీనివాసరెడ్డి, జల్ రామ్, చంద్రకళ, రేణుకతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

---



## హోంగార్డ్ కుటుంబానికి ఆర్థిక సాయం చెక్కును అందచేసిన సిపి

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** ఆకస్మికంగా మరణించిన హోంగార్డ్ కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత చేతుల మీదుగా ఐదు లక్షల ఆర్థిక సాయం చెక్కును బుధవారం సీపీ కార్యాలయంలో అందజేశారు. రాష్ట్ర పోలీస్ శాఖకు సహాయ సహకారాలను అందిస్తున్న హోంగార్డ్స్ ఆకస్మికంగా గాని లేదా ప్రమాదాల్లో మరణిస్తే సిబ్బంది కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని, మరణించిన హోంగార్డ్స్ కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించాలని రాష్ట్ర పోలీస్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా దుగ్గొండి పోలీస్ స్టేషన్ పరిధిలో హోంగార్డ్ గా విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఆకస్మికంగా మరణించిన పి. శ్రీనివాస్ రెడ్డి భార్యకు పోలీస్ కమిషనర్ ఆర్థిక చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎ.ఆర్ అదనపు డీసీపీ శ్రీనివాస్, హోంగార్డ్స్ ఆర్ ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

---



## బెల్లంపల్లి పట్టణం పేరుకే గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా మారింది

**ప్రజా వాయిస్ బెల్లంపల్లి టౌన్** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎక్కడ చూసినా నీటి గుంతలు బెల్లంపల్లిలో రోడ్డు వెడల్పుల పేరుతో శంకుస్థాపనలకే పరిమితం అవుతా ఉన్నాయి ఇది ఎమ్మెల్యే గడ్డం వినోద్ అనాలోచిత విధానం వల్లే అని ప్రజలు అనుకుంటున్నాం రోడ్డు వెడల్పు పేరుతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు ఇండ్లు కూల్చివేసి చిరు వ్యాపారస్తులకు ఉపాధి లేకుండా చేశారు. బుధవారం కురిసిన వర్షానికి బెల్లంపల్లి మొత్తం జలమయంగా మారింది మొన్నటికి మొన్న గుంతలు కూడుపుతామనీ మున్సిపల్ కౌన్సిల్ సమావేశ తీర్మానంలో 2 లక్షల రూపాయలను కేటాయించడం జరిగింది. కానీ ఇక్కడ చేసింది మాత్రం ఏమీ లేదు ఒక రెండు మూడు బస్తాల తోటి కాంక్రీట్ కలిపి పోశారే తప్ప జరిగింది ఏమీ లేదు ఎటు చూసినా ఈ గుంతలమయం వెంటనే ఏదైతే 2 లక్షల రూపాయలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించబడిందో ఆ డబ్బు తోటి రంధ్రాలు కూర్చాలని వాహనదారులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, రోడ్డు వెడల్పు కార్యక్రమాలు ఎందుకు ఆపారో కూడా సమాధానం ఇవ్వాలని బెల్లంపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

---



## బడి బక్కనే బావి.. ప్రమాదంలో పిల్లల ప్రాణాలు

- గుడితండాలో ప్రభుత్వ బడికి రక్షణ కరవు..!
- ప్రహరీ గోడ, గేటు లేక విద్యార్థుల అవస్థలు

**కేసముద్రం, ప్రజావాయిస్:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి దానికి భిన్నంగా ఉంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని గుడితండాలో ఉన్న జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలకి ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్), ప్రధాన గేటు లేకపోవడంతో విద్యార్థుల భద్రత తీవ్ర ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ఓ పక్క ప్రధాన రహదారి, మరో పక్క ఎస్సారెస్పీ కెనాల్ కాలువ, వెనుక అతి పెద్ద బావి పక్కనే పాఠశాల ఉండడం వల్ల చిన్న పిల్లలు ఎప్పుడు రోడ్డుపైకి వస్తారో, ఎప్పుడు బావి , కాలువ వైపు వెళ్తారో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అలాగే పాఠశాల చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో పశువులు, వీధి కుక్కలు స్వేచ్ఛగా పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయి. పాఠశాల సమయం ముగిసిన తర్వాత రాత్రి వేళల్లో గేటు, కాంపౌండ్ వాల్ లేని ఈ ఆవరణ ఆకతాయిలకు, వ్యసనపరులకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగ మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరగకముందే ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ప్రత్యేక నిధులు మంజూరు చేసి పాఠశాలకు ప్రహరీ గోడ, రక్షణ గేటు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యం వీడి పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

---

## ఆత్మవిశ్వాసం, ఆత్మనియంత్రణతో నిరంతరం శ్రమించాలి

- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలి
- చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ విద్యాభ్యాసంపై పూర్తి దృష్టి సారించాలి
- విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశం అందించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్


**ప్రజా వాయిస్/మహబూబాబాద్** జిల్లాలో టీఆర్ఎస్ఎంఏ ఆధ్వర్యంలో బాలాజీ గార్డెన్స్ లో నిర్వహించిన పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 3,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ముందుగా విద్యార్థులకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే విధంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, సురక్షిత రవాణా విధానాలపై ప్రత్యేక వీడియోలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలంటే చట్టాలను గౌరవిస్తూ, భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు,ప్రతి విద్యార్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించేందుకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మనియంత్రణతో నిరంతరం శ్రమించాలని సూచించారు. జీవితంలో విజయాలను సాధించడంలో సెల్ఫ్ కంట్రోల్ (ఆత్మనియంత్రణ) అత్యంత కీలకమైన అంశమని తెలిపారు.తన విద్యాభ్యాసం, యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించిన ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకుంటూ, తన జీవితంలో తన తండ్రే ప్రధాన స్ఫూర్తి, మార్గదర్శి, ప్రేరణగా నిలిచారని తెలిపారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, కష్టపడి చదవాలనే తపన, లక్ష్యంపై అచంచలమైన దృష్టి ఉంటే ఏ విద్యార్థైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని పేర్కొన్నారు.లక్ష్యాన్ని సాధించాలంటే ఎల్లప్పుడూ పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచిస్తూ, "100 మీటర్లను రికార్డు సమయంలో పూర్తి చేయాలనే లక్ష్యం ఉంటే, ముందుగా 1000 మీటర్ల సాధన చేయాలి. అప్పుడు అసలు లక్ష్యాన్ని చేరుకోవడం మరింత సులభమవుతుంది" అని విద్యార్థులకు ఉదాహరణతో వివరించారు.విద్యార్థుల భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యపై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు మరియు ఇతర వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, చెడు అలవాట్లు జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. మంచి ఆలోచనలు, మంచి స్నేహితులు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం విజయానికి బాటలు వేస్తాయని తెలిపారు.విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని అందించినందుకు టి ఆర్ ఎస్ ఎం ఎ ప్రతినిధులు జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



---

## ఏటీసీలో అడ్మిషన్లు ప్రారంభం

- నిర్ణీత గడువును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఏటిసి ప్రిన్సిపల్ విజయ కుమారి



**ప్రజా వాయిస్/తాండూర్:** తాండూర్ పట్టణ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో ఉన్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ విజయ్ కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇదివరకే ఆన్లైన్ అప్లికేషన్ చేసుకున్న విద్యార్థులు నేరుగా ఏటీసీలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. మొదటిరోజు (బుధవారం) మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ గ్రూప్ కు సంబంధించి పుల్ మామిడి ప్రీతం రాజ్ ద్వారా ఒక అప్లికేషన్ వచ్చినట్లు వెల్లడించారు.ఇంకా ఎవరైనా ఆన్లైన్ సీట్ అలాట్మెంట్ అయినా వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు రెండు జతల జిరాక్స్ తీసుకొని నేరుగా ఏటీసీలో అడ్మిషన్ పొందాలని సూచించారు.కాగా విద్యార్థులకు కావలసిన విశాలవంతమైన తరగతి గదులు, డిజిటల్ బోర్డ్, ఆధునిక శిక్షణకు అవసరమైన కంప్యూటర్లు, పరికరాలు మా కళాశాలలో ఉన్నట్లు తెలిపారు. కావున అర్హులైన విద్యార్థులు ఆగస్టు ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అడ్మిషన్లు పొందాలని అన్నారు.